సాక్షి అనకాపల్లి

శనివారం, 11, ఫిబ్రవరి, 2023



పోర్టులో లోకో ట్రెయిన్

విశాఖ: గంగవరం పోర్టు నూతన లోకో ట్రైన్‌ను శుక్రవారం ప్రారంభించారు. దీంతో పోర్టు నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది.



కేజీహెచ్‌లో వార్డుల తనిఖీ

విశాఖ: కేజీహెచ్‌లో ఆరుగురు వైద్యుల బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. సభ్యులు 26 విభాగాలను పరిశీలించారు.



మిన్నంటిన ఆర్తనాదాలు

పెదబయలు: ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురి భౌతికకాయాలు శుక్రవారం స్వగ్రామాలకు చేరుకున్నాయి.

న్యూస్‌రీల్

నూకాలమ్మ జాతరకు శ్రీకారం

- ఘనంగా కొత్త అమావాస్య రాటమహోత్సవం



అమ్మవారి జాతరకు రాట వేస్తున్న ఈవో చంద్రశేఖర్

అనకాపల్లి టౌన్: గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య, జాతర మహోత్సవాలకు శుక్రవారం రాట వేశారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ దంపతుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మార్చి 20న అమ్మవారి జాతర, 21న కొత్త అమావాస్య పండగ జరుగుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.

చెరకు సాగులో ఆధునిక సాంకేతికత



చెరకు రైతులకు ఆధునిక వంగడాలను అందజేస్తున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి టౌన్: ఆధునిక పద్ధతులను ఉపయోగించి చెరకు సాగు చేస్తే రైతులకు పూర్వ వైభవం వస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా టీ అండ్ వి (శాస్త్రవేత్తలు) సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరాలలో బూడిద తెగుళ్ల, మోజాయిక్ తెగుళ్ల, నివారణ చర్యలను ఆయన వివరించారు. అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో అపరాలు, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వుల పంటల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని పేర్కొన్నారు. విశాఖ జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి మాట్లాడారు. అనంతరం చెరకు రైతులకు ఆధునిక వంగడాలను అందజేశారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు చిత్కళాదేవి, కె.వి.రమణమూర్తి, ఆదిలక్ష్మి, విశాలాక్షి, భవాని, శరిత, శ్రీదేవి, టి అండ్ వి మీటింగ్ సమన్వయకర్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతులకు ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

రావికమతం: మరుపాక రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.258లో 8 ఎకరాల్లో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్, బీఎం ఇసుక తయారీ క్వారీ ఏర్పాటుకై ఆ గ్రామంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్వారీ ఏర్పాటుకు బీఎంజే అప్పారావు అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారని అక్కడ క్వారీ వలన పంచాయితీ అభివృద్ధికి ఏటా రూ.లక్షల నిధులొస్తాయని డీఆర్వో తెలిపారు. అలాగే దానివలన ఎవరికైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని కోరగా కొంత మంది రైతులు అభ్యంతరం తెలుపుతూ ఒక ఫిర్యాదును అందించారు. రైతుల సమస్యలను తీర్చి, క్వారీ ఏర్పాటు చేస్తే తమకు అభ్యంతరం లేదని గొంప, పిల్లవానిపాలెం గ్రామాలకు చెందిన మరికొంత మంది రైతులు తెలిపారు. దీనిని ప్రభుత్వానికి నివేదించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని డీఆర్వో వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, గ్రామ ఉప సర్పంచ్ పండూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మవద్దు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఎలాంటి ఉద్యోగాల నియామకం చేపట్టడం లేదని, దళారుల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు సూచించారు. ఇటీవల దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంతమంది దళారులు నిరుద్యోగులను మభ్యపెడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటుండంతో ఈవో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది దళారులు డబ్బులు వసూలు చేస్తున్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

సాగిపో.. మెరుపులా..

బుల్లెట్‌లా దూసుకుపోవచ్చు.. మెరుపు వేగంతో సాగిపోవచ్చు.. దాదాపు పూర్తి కావచ్చిన అనకాపల్లి–ఆనందపురం ఆరు లేన్ల రహదారిపై గంటకు 120 కి.మీ వేగంతో వెళ్లవచ్చని అధికారులు భరోసా ఇస్తున్నారు. మార్చి నెలాఖరుకు పూర్తి కానున్న ఈ రోడ్డు విస్తరణతో విశాఖ నగరానికి ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి.

- శరవేగంగా అనకాపల్లి–ఆనందపురం ఆరు లేన్ల రహదారి
- గంటకు 120 కి.మీ వేగంతో వెళ్లే అవకాశం
- విశాఖ నగరానికి తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- 98 శాతం పనులు పూర్తి.. మార్చి నెలాఖరుకు సిద్ధం



అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విహంగ వీక్షణం, (ఇన్‌సెట్) తళతళా మెరుస్తున్న రోడ్డు

సాక్షి, అనకాపల్లి/తుమ్మపాల: సర్రున సాగిపోయేలా ఆరు లైన్ల రోడ్డు.. డివైడర్లపై ఆహ్లాదకరంగా వేలాది మొక్కల పెంపకం.. బ్రేకుతో పనిలేదు.. టోల్‌ప్లాజా వచ్చే వరకు వాహనాన్ని నిలపాల్సిన అవసరమే రాదు.. ఇవీ అనకాపల్లి–ఆనందపురం ఎన్‌హెచ్–16 జాతీయ రహదారి ప్రత్యేకతలు. విశాఖ నగరానికి రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను పరిష్కరించేందుకు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో భాగంగా అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం శరవేగంతో సాగుతోంది. రూ.2,013 కోట్లతో 50.8 కిలోమీటర్ల పొడవున దీనిని నిర్మిస్తున్నారు. ఢిల్లీకి చెందిన మెగా ఇంజనీరింగ్ డీబీఎల్ సంస్థ 98 శాతం పనులు పూర్తి చేసి మార్చి నెలాఖరు నాటికి జాతికి అంకితం చేసేందుకు వేగం పెంచింది. గంటకు 120 కిలోమీటర్ల వేగంగా వాహనాలు ప్రయాణించేలా ఈ రహదారిని విస్తరించారు. టోల్‌ప్లాజా వద్ద తప్పితే మరెక్కడా ఆగాల్సిన అవసరం ఉండదు. ప్రతి రెండు కిలోమీటర్లకు సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్‌తో నిఘా ఏర్పాటు చేశారు. దీని ద్వారా స్పీడ్ డిస్‌ప్లే, స్పీడ్ కంట్రోల్, ట్రాఫిక్ సిగ్నల్స్ తెలుసుకోవడం కూడా సులభంగా ఉంటుంది. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో, వంతెనల జంక్షన్లలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి

చెన్నై–కలకత్తా 16వ నంబర్ జాతీయ రహదారి



అనకాపల్లి బైపాస్ వద్ద ఇంటర్ చేంజ్ సెక్షన్, సోలార్ లైట్లు..

అనకాపల్లి, గాజువాక, ఎన్ఏడీ, విశాఖనగరం మీదుగా సాగిపోతుంది. రవాణా, ప్రజా రవాణా తదితర వాహనాలు విశాఖ నగరం మీద నుంచి రాకపోకలు చేయడంతో నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి.

అనకాపల్లి నుంచి సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం వరకు జాతీయ రహదారిని కలుపుతూ ఈ ప్రాజెక్టు చేపట్టడంతో నగరానికి ట్రాఫిక్ సమస్య తొలగిపోనుంది. కేవలం పనులు ఉన్నవారు మాత్రమే నగరంలోకి వస్తారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి వద్ద బైపాస్ నుంచి సబ్బవరం మీదుగా ఆనందపురం వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. దీంతో నగరానికి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. విశాఖ నగరానికి ఇది బైపాస్ రోడ్డుగా ఉపయోగపడనుంది. సబ్బవరం దగ్గర ఒక ఇంటర్ చేంజ్ సెక్షన్, పెందుర్తి దగ్గర మరొకటి ఏర్పాటు చేయడంతో విశాఖనగరానికి వెళ్లేందుకు మరిన్ని దారులు ఏర్పడ్డాయి.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు

ఈ జాతీయ రహదారి పొడవు 50.8 కిలోమీటర్ల మేర ఉంది. రోడ్డు పొడవున ఇరువైపులా 15 వేలకు పైగా మొక్కలు నాటడం, నిత్యం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్డుకు మధ్యలో 32 వేలకు పైగా మొక్కలను నాటుతున్నారు.

స్థానికులకు నో టోల్‌ట్యాక్స్

ఈ రహదారిపై మొత్తం మూడు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేయనున్నారు. క్లోజ్డ్ టోలింగ్ సిస్టమ్ ద్వారా అనకాపల్లి వద్ద మర్రిపాలెం, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం ప్రాంతాలలో చేపట్టే టోల్‌ప్లాజాల వద్ద స్థానికులు టోల్‌ఫీజు చెల్లించనక్కరలేదు. సర్వీసు రోడ్డును ఏ టోల్‌ప్లాజాకు అనుసంధానం చేయడం లేదు. దీంతో స్థానికులు టోల్‌ప్లాజాకు వెళ్లాల్సిన పనిలేకుండా సులభతరం చేస్తున్నారు.

రూ.2,013 కోట్లతో నిర్మాణం

దాదాపు 35 గ్రామాలను తాకుతూ నిర్మిస్తున్న ఈ రోడ్డుకు ప్రభుత్వం రూ.2,013 కోట్లు నిధులు వెచ్చిస్తోంది. ఈ మార్గంలో అనకాపల్లి బైపాస్ వద్ద ఒకటి, సబ్బవరం, పెందుర్తి జంక్షన్లలో మూడు ఇంటర్ చేంజ్ సెక్షన్లు, రెండు రైల్వే వంతెనలతో పాటు 21 అండర్ బ్రిడ్జిలు, 10 వంతెనలు, 52 బాక్స్ కల్వర్టులు, 44 పైప్ కల్వర్టులు, 25 గ్రామాల వద్ద అప్రోచ్ రోడ్లు, 34 బస్‌స్టేషన్లు, 20 జంక్షన్లను రూపొందించారు. ఫ్లైఓవర్‌ల వద్ద గడ్డర్లు ఏర్పాటు చేసే ప్రాజెక్టును డీబీఎల్ సంస్థ చేపడుతుంది.

మార్చి నెలాఖరుకు పనులు పూర్తి



జాతీయ రహదారి విస్తరణ పనులు 98 శాతం పూర్తయ్యాయి. వచ్చే నెలాఖరునాటికి పనులు పూర్తయ్యేలా వేగం పెంచాం. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు ఏర్పాటు చేసిన జాతీయ రహదారి విస్తరణ పనులతో విశాఖ నగరానికి ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి. రోడ్డుపై ప్రతి రెండు కిలోమీటర్ల వద్ద సీసీ కెమెరాలు, జాతీయ రహదారి కూడలిలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశాం. ప్రమాదాలకు తావు లేకుండా ఆధునిక విధానంలో నిర్మాణం చేపట్టిన జాతీయ రహదారి ఇది. వేగంతో వెళ్లినా ప్రమాదాలకు తావు లేకుండా జాతీయ రహదారి ఉంటుంది.

– ప్రమోద్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్, డీబీఎల్ సంస్థ

ఆలయాల భూముల పరిరక్షణకు ప్రాధాన్యం

- దేవదాయశాఖ ఏడీసీ చంద్రకుమార్



మాట్లాడుతున్న దేవదాయశాఖ ఏడీసీ చంద్రకుమార్

సింహాచలం: దేవాలయాల భూముల పరిరక్షణే ధ్యేయంగా ఆయా ఆలయాల ఈవోలు, ఏసీలు ఇతర అధికారులు పనిచేయాలని, వందేళ్ల తర్వాత ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులతో కలిసి ఎక్కడెక్కడ దేవాలయ భూములు ఉన్నాయో వాటి కొలతలు సక్రమంగా కొలిపించి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ ఆలయాల ఈవోలకు ఆదేశించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాలలో శనివారం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఉన్న దేవదాయశాఖ ఈవోలు, ఏసీలు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. దేవాలయాలకు సంబంధించిన భూములు ఎలా పరిరక్షించాలో వివరించారు. దేవాలయాల భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో అవగాహన ఏర్పరుచుకుని, రికార్డులను దగ్గర ఉంచుకుని రీసర్వే జరుగుతున్నప్పుడు రెవెన్యూ అధికారులతో కలిసి సంబంధిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఎన్ని భూములు ఉన్నాయో వాటి రికార్డులను రిసర్వే చేసే అధికారులకు అందించాల్సి ఉంటుందన్నారు. తదుపరి హద్దులను గుర్తించి తిరిగి అప్పగించే ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ విశాఖ డీసీ సుజాత, ఏసీ శిరీష, ఐదు జిల్లాలకు చెందిన ఏసీలు, ఆలయాల ఈవోలు, అమరావతిలోని మండల ఎండోమెంట్ ఆఫీసర్, కాకినాడకు చెందిన ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే 'శ్రీశైలం' దర్శన టికెట్లు

దాబాగార్డెన్స్ : విశాఖ నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సుల్లోనే దర్శన టికెట్లను అందజేయనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. శ్రీశైలం సూపర్ లగ్జరీ బస్సులో ముందస్తుగా టికెట్ రిజర్వేషన్‌తో పాటు శ్రీశైలం ప్రత్యేక దర్శనం (శీఘ్ర దర్శనం, అతి శీఘ్రదర్శనం) టికెట్ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం www. apsrtconline. in ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, లేదా నేరుగా ద్వారకాబస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా బుక్‌చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అప్పలరాజు పేర్కొన్నారు.

134 జంటలకు వివాహ కానుక

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకంలో రూ.90.30 లక్షల ఆర్థిక సాయం

తుమ్మపాల: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రూ.90.30 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అక్టోబర్–డిసెంబర్ 2022 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 134 మందికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారులు ఖాతాల్లోకి నగదు జమ చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించినట్లు తెలిపారు. జిల్లాలో వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ద్వారా ఎస్సీ కులానికి చెందిన 28 జంటలకు, ఎస్సీలతో కులాంతర వివాహం 4, ఎస్టీ 1, ఎస్టీతో కులాంతర వివాహం 1, బీసీలు 82, బీసీలతో కులాంతరం 11, అంగవైకల్యంతో ఉన్న 2 జంటలకు.. వైఎస్సార్ షాదీ తోఫా పథకంలో 5 ముస్లిం జంటలకు లబ్ధి చేకూరిందన్నారు. ఇక నుంచి ప్రతి త్రైమాసికానికి ఒకసారి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. వధూవరులు వివాహమైన 30 రోజుల్లో దగ్గర్లోని సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు ధ్రువీకరించుకొని అర్హులకు ప్రతి ఏటా ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్ నెలల్లో ఆర్థిక సహాయం అందిస్తారన్నారు.

ప్రాంతీయ అగ్నిమాపక అధికారిగా నిరంజన్‌రెడ్డి



నిరంజన్‌రెడ్డి

అల్లిపురం (విశాఖ దక్షిణ): అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారిగా డి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాంతీయ కార్యాలయాన్ని మహారాణిపేట, దండుబజారులో గల జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో రెండు రీజియన్లు ఉండేవన్నారు. వాటిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం నిమిత్తం విశాఖ, రాజమండ్రి, గుంటూరు, కర్నూలు కేంద్రాలుగా నాలుగు రీజియన్లుగా ఏర్పాటు చేశారన్నారు. జోన్–1 పరిధిలో విశాఖపట్నం రీజియన్‌లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలు ఉన్నాయన్నారు.

పరిశ్రమల ప్రమాదాలపై అవగాహన..

పరిశ్రమల్లో ప్రమాదాలపై దృష్టి పెడతామని ఆర్.ఎఫ్.ఓ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలలో భద్రత నిమిత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజయనగరంలో రీజనల్ ట్రెనింగ్ సెంటర్‌లో తగినంత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

పట్టభద్రుల స్ట్రాంగ్ రూమ్.. స్వర్ణభారతి

- ఇక్కడి నుంచే 6 జిల్లాల బ్యాలెట్ బాక్సుల పంపిణీ, నిర్వహణ
- సహాయక పోలింగ్ స్టేషన్ల గుర్తింపునకు తహసీల్దార్ల బృందాలు
- ఎన్నికల ప్రక్రియ కోసం 12 విభాగాల జిల్లా అధికారులకు బాధ్యతలు
- ఓటు ఎక్కడో తెలుసుకొనేందుకు రెండ్రోజుల్లో గ్రాడ్యుయేట్లకు అవగాహన సదస్సులు
- ఈ నెల 13 వరకూ కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం



సాక్షి, విశాఖపట్నం : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఎన్నికల విధుల సర్దుబాటు, ప్రవర్తనా నియమావళి, బ్యాలెట్ బాక్సుల పంపిణీ, పోలింగ్ స్టేషన్ల ఎంపిక తదితర అంశాలపై అధికారులు నిరంతర సమీక్షల్లో బిజీబిజీగా మారారు. ఈ నెల 13వ తేదీ వరకూ కొత్తగా ఓటర్ల నమోదుకు గడువు ఉండటంతో దానిపైనా దృష్టిసారించిన అధికారులు.. ఎవరి ఓటు ఎక్కడుందో తెలుసుకునేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి జిల్లాల్లో మొదలైంది. ఎన్నికల కోసం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున పూర్తిస్థాయి చర్యలకు ఉపక్రమించారు. తమ పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్లను తనిఖీలు నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. 1300కి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ల వద్ద.. సహాయక పోలింగ్ స్టేషన్లని కూడా ప్రత్యామ్నాయంగా చూడాలని సూచించారు. 6 జిల్లాల పరిధిలో ఈ తరహా 48 యాక్సిలరీ పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. వీటిని కూడా పరిశీలించి.. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించిన ఎంపీడీవోల వద్ద బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలింగ్ అధికారుల్ని గుర్తించి, వారికి ఆర్డర్లు ఇవ్వాలని 5 జిల్లాల కలెక్టర్లకు డా.మల్లికార్జున రిటర్నింగ్ అధికారి హోదాలో లేఖలు రాశారు. ప్రతి జిల్లాలో తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ ముగిసిన తర్వాత మొత్తం బ్యాలెట్ బాక్సులను విశాఖ తరలించేందుకు కావల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. 6 జిల్లాలకు సంబంధించి.. బ్యాలెట్ బాక్సుల నిర్వహణ ప్రక్రియ మొత్తం స్వర్ణభారతి నుంచే నిర్వహించనున్నారు.

కౌంటింగ్ స్వర్ణ భారతిలోనే..

ఆరు జిల్లాల బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌గా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని గుర్తించారు. ప్రతి జిల్లాకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు విడివిడిగా సబ్ స్ట్రాంగ్ రూమ్‌లు స్టేడియంలోనే ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ కూడా ఇక్కడే నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని భద్రత వ్యవహారాల పరంగా పరిశీలించి.. తమ పర్యవేక్షణలోకి పోలీసులు తీసుకోనున్నారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కౌంటింగ్‌కు 36 నుంచి 48 గంటల వరకూ సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితాలు వెల్లడి కాకపోతే.. మరికొంత సమయం పట్టనుంది కాబట్టి.. దానికి సంబంధించి కూడా ఏర్పాట్లను ముందస్తుగా సిద్ధం చేయాలని కలెక్టర్ డా.మల్లికార్జున సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 12 విధుల విభాగాలకు 12 మంది జిల్లా అధికారులను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, అబ్జర్వర్, ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు తదితర విధుల్ని జిల్లా అధికారులకు అప్పగించారు.

మీ ఓటు తెలుసుకోండి..?

ఓటర్లు తమ ఓటు హక్కు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో knowyourvote అనే ఆప్షన్‌ను ఎంచుకొని కార్డు వివరాలు ఇస్తే.. మీ ఓటు ఎక్కడ ఉంది అనేది స్పష్టంగా తెలుస్తుందని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఓట్లకు సంబంధించి గ్రాడ్యుయేట్లలో అవగాహన కల్పించేందుకు అవసరమైన శిక్షణని రెండు మూడు రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు కొత్తగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు పట్టభద్రుల కు ఈ నెల 13వ తేదీ వరకూ గడువు ఉన్నట్లు డీఆర్‌వో తెలిపారు. 13వ తేదీ సాయంత్రంలోపు నమోదు చేసుకుంటే.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేశారు.

City Guest



విజయదేవరకొండతో నటించాలని ఉంది

వర్ధమాన నటి ప్రగ్యా నయన్

సీతమ్మధార (విశాఖ ఉత్తర): 'విశాఖ అంటే చాలా ఇష్టం..ఇక్కడ అందాలకు ఫిదా అయ్యా' అని వర్ధమాన నటి ప్రగ్యా నయన్ పేర్కొన్నారు. దిల్‌వాలే సినిమా షూటింగ్ నిమిత్తం ఆమె విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా నయన్‌తో 'సాక్షి'తో చిట్‌చాట్.

సాక్షి : సినిమా రంగానికి ఎలా వచ్చారు?

నయన్ : మోడలింగ్‌లో రాణించడంతో నాపై నమ్మకం కలిగింది. క్రమంగా సినిమా అవకాశాలు వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటున్నా.

సాక్షి : ఇంతవరకు ఎన్ని చిత్రాల్లో నటించారు?

నయన్ : మూడు చిత్రాల్లో నటించా. సురాపానం నా తొలిచిత్రం..మంచి పేరు వచ్చింది. చక్రవ్యూహం మార్చిలో విడుదల కానుంది. మూడో చిత్రం దిల్‌వాలే. మరో సినిమా కూడా ఈనెల 26న ప్రారంభం కానుంది.

సాక్షి : మీకిష్టమైన హీరో

నయన్ : బన్నీ అంటే ఇష్టం. టాలీవుడ్‌లో అందరు హీరోలతో పనిచేయాలని ఉంది. ముఖ్యంగా విజయదేవరకొండ, పవన్ కల్యాణ్ వంటి స్టార్లతో నటించాలని ఉంది.

సాక్షి: మీ గురించి చెప్పండి

నయన్ : బెంగళూరులో చదువుకున్నా..అక్కడే విప్రోలో ఉద్యోగం చేస్తూనే మోడలింగ్ చేశా.. అలా సినిమా అవకాశాలు రావడంతో ఉద్యోగం మానేసి పూర్తిగా సినిమాలపై దృష్టి పెట్టా.

సాక్షి : వైజాగ్ ఎలా ఉంది

నయన్ : వావ్ అద్భుతంగా ఉంది. ఇక్కడ బీచ్, పర్యాటక ప్రాంతాలు నా మనస్సు దోచుకున్నాయి. ఐ లవ్ వైజాగ్

క్లుప్తంగా

శారదా పీఠానికి వేద గాయత్రిదేవి ఆలయం దత్తత



స్వరూపానందేంద్ర సరస్వతికి పత్రాలు అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సింహాచలం : జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోటలో ఉన్న వేద గాయత్రి దేవి ఆలయాన్ని విశాఖ శ్రీ శారదా పీఠానికి ఆలయ కమిటీ దత్తత ఇచ్చింది. ఈ మేరకు శారదా పీఠంలో స్వరూపానందేంద్ర సరస్వతిని ఆలయ కమిటీ ధర్మకర్త రాపర్తి కన్నా, గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు పీఠంలో శుక్రవారం కలిసి సంబంధిత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త రాపర్తి కన్నా మాట్లాడుతూ వేదమాత గాయత్రి దేవి ఆలయాన్ని కమిటీ అభ్యర్థన మేరకు విశాఖ శ్రీ శారదాపీఠంలో కలపాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ఈ మేరకు స్వామీజీని కలిసి పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్మారావు, కార్యదర్శి శర్మ, ప్రతినిధులు వాసు మాస్టారు, మంగు శేషగిరిరావు, కృష్ణమూర్తి మాస్టారు, ఆకెళ్ల బాబీ, సుబ్బారామన్, జి.రామారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

నాతవరం: స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్పీ గౌతమిసాలి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. దీంతో అక్కడ సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ రికార్డులను ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను సైతం పరిశీలించి వెనుతిరిగారు.

వృథాగా తాండవ సాగు నీరు

- రూ. 9 లక్షలు మంజూరైనా, మరమ్మతులు చేయడంలో జాప్యం
- రోజు రోజుకు తగ్గిపోతున్న నీటిమట్టం



తాండవ ప్రధాన గేట్ల నుంచి వృథాగా లీకేజీ నీరు

నాతవరం: తాండవ ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యంగా జలాశయం నీటి మట్టం రోజురోజుకీ తగ్గిపోతోంది. రిజర్వాయరు ప్రధాన గేట్లు మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం రూ. 9 లక్షలు మంజూరు చేసింది. అయినప్పటికీ ఈ పనులు చేయడంలో తీవ్ర జాప్యం చేయడంతో లీకేజీ ద్వారా సాగు నీరు వృథాగా పోతోంది. తాండవ ప్రాజెక్టు నీరు ఆధారంగా ఏటా ఖరీఫ్‌లో అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 52 వేలు ఎకరాల్లో వరి పండిస్తారు. గతేడాది వర్షాలు అధికంగా కురవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలకు ఢోకా లేదు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు శివారు ఆయకట్టుకు సైతం పుష్కలంగా నీరు సరఫరా చేశారు. ఖరీఫ్‌లో రైతుల అభీష్టం మేరకు నీరు విడుదల చేసి గతేడాది డిసెంబరు 4న నిలుపుదల చేశారు.

రెండు నెలల వ్యవధిలో...

తాండవ ప్రాజెక్టు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు, డేడ్ స్టోరేజీ నీటి మట్టం 340 అడుగులుగా అధికారులు పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నీటి నిలుపుదల సమయానికి ప్రాజెక్టులో 373.2 అడుగులు నీరు ఉండేది. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో గురువారం ఉదయానికి 372.5 అడుగులు నీటి మట్టం తగ్గింది. రెండు నెలలు వ్యవధిలో అడుగు వరకు నీరు ప్రాజెక్టు నుంచి లీకేజీ ద్వారా వృథాగా పోయింది. ఈ విధంగా నిత్యం బయటకు వృథాగా పోతే నీటి నిల్వలు తగ్గిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృథా నీటిని అరికట్టాలని కోరుతున్నారు. ప్రాజెక్టులో నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉందని నీరు తగ్గాక లీకేజీలు అరికడతామని అధికారులు హామీ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయంపై ప్రాజెక్టు జేఈ రామకృష్ణ మాట్లాడుతూ గేట్లు మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, విజయవాడ నుంచి నైపుణ్యం కలిగిన మెకానికల్ ఇంజినీర్లు తీసుకొచ్చి పనులు చేసి వృథాగా పోతున్న నీటిని అరికడతామన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 24 కుటుంబాలు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల: వైఎస్సార్ సీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. 20 రోజుల క్రితం ఎల్. పొన్నవోలు పంచాయతీ నుంచి 24 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరగా, తాజాగా కింతలి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరంతా చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి స్వచ్ఛందంగా వెళ్లి శుక్రవారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో రావాడ అర్జున, మల్లారపు ఆరిబాబు, మల్లేటి రాజేష్, పెట్లా మాణిక్యం, అంగూరి ప్రభ, పూడి నూకరాజు, తమ్మలపు సంజీవి, మల్లారపు ప్రేమ కుమార్, కోడూరి పండు, మక్క సిక్కన్న, ఇల్లపు ప్రసాద్, ఇల్లపు పైడితల్లమ్మ, శానాపతి రమణమ్మ, మట్టా రాజులమ్మ, తాటికొండ వరహాలమ్మ, అప్పాన లక్ష్మి, మొండెపు వరహాలుతోపాటు మరో ఏడు కుటుంబాలు వారు ఉన్నారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు డిప్యూటీ సీఎం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తలను ప్రాణాలొడ్డయినా కాపాడుకుంటానని డిప్యూటీ సీఎం భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జామి చిన్న, సీనియర్ నాయకులు వేచలపు సహదేవుడు, పెట్లా ఈశ్వరరావు, కాకినాడ శ్రీను, చిన్నబాబు, ఎం. చిన్న, మోహన్, పెదపూడి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలంతా జగన్ వెంటే...

- మండలి ప్రభుత్వ విప్ డొక్కా



మాట్లాడుతున్న డొక్కా

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): రాష్ట్రంలో పేదల సంక్షేమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో శ్రద్ధ వహిస్తూ పాలన అందిస్తున్నారని, ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఓ హోటల్‌లో దళిత నాయకుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి వి.జె. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ×మేధావుల సదస్సులో× డొక్కా మాణిక్యవరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు, మహిళలకు సముచిత స్థానం కల్పించడంపై ఆయా సామాజిక వర్గాలు ఎంతో ఆనందంగా ఉన్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చి మైనారిటీల అభ్యున్నతికి అనేక సంస్కరణలు చేపట్టి విశేష ఆదరణ చూరగొన్న ముఖ్యమంత్రి జగన్ అన్నారు. సభాధ్యక్షుడు వి.జె.అజయ్ కుమార్ మాట్లాడుతూ జగనన్నను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ. రెహ్మాన్ మాట్లాడుతూ బలహీన వర్గాలను ఐక్యం చేసి ముఖ్యమంత్రి జగన్ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు మేధావులు ముందుకు రావాలన్నారు. ఈ సదస్సులో రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదన్, కార్పొరేటర్లు రేయ్యి వెంకటరమణ, మాసిపోగు రాజు. ముఖ్య నాయకులు అక్కరమాని వెంకటరావు, వేల్పుల విజయ్ కుమార్, ఎస్. వెంకట్, రాజ్ కుమార్, వెంకటరావు, సుభాష్ చంద్రబోస్, ప్రొఫెసర్లు అర్జున్, పుల్లారావు, జార్జ్ విక్టర్, తదితర నాయకులు ప్రసంగించారు. త్వరలో దళితుల సంక్షేమంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడానికి నిర్ణయించినట్లు అజయ్ కుమార్ ప్రకటించారు. అతిథులను అజయ్ కుమార్ సత్కరించారు

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం

- ఐఓసీఎల్ పరిశోధన విభాగం డైరెక్టర్ రామ్ కుమార్



డాక్టర్ రామ్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రామ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఏయూను సందర్శించి వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డితో భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన రామ్ కుమార్‌ను వర్సిటీ తరపున వీసీ ప్రసాద రెడ్డి సత్కరించారు. అనంతరం పాలకమండలి సమావేశ మందిరంలో ఏయూ అధికారులు, ఆచార్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ ఇంధన రంగానికి ఉపయుక్తంగా నిలిచేలా ఏయూ నుంచి విశిష్ట ఆలోచనలతో పరిశోధనలను తాము ప్రోత్సహిస్తామన్నారు. గత ఐదు దశాబ్దాలుగా ఐఓసీఎల్‌కు చెందిన ప్రత్యేక రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ చేపడుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలు, పేటెంట్‌లను వివరించారు. త్వరలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధనలపై వివరించారు. నెట్, గేట్ అర్హత సాధించిన పరిశోధకులకు తమతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. బయోమాస్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్ – పాలిమర్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ రంగాల్లో సంయుక్తంగా పని చేయడానికి అనుకూలంగా ఉన్న అంశాలను వివరించారు. ఏయూ విద్యార్థులు, పరిశోధకులు నూతన ఆలోచనలతో వస్తే తాము నిర్వహించే స్టార్టప్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఐఓసీఎల్‌తో తమ భాగస్వామ్యం మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిషోర్ బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, నాణ్యత పాటించకుంటే సీజ్

- వాటర్ ప్లాంట్లలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రవికుమార్ తనిఖీలు



శ్రీనివాస వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేస్తున్న రవికుమార్, తహసీల్దార్ శ్రీరామ్మూర్తి

అనకాపల్లిటౌన్: జిల్లాలోని వాటర్ ప్లాంట్లలో సరైన భద్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు సీజ్ చేస్తున్నామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రవికుమార్ హెచ్చరించారు. పట్టణంలోని రింగ్‌రోడ్డులో శ్రీనివాస ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను, మండలంలో రేబాక గ్రామంలో మునేంద్రముని ప్యాకేజీ వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఆయన తహసీల్దార్ వై శ్రీరామ్మూర్తితో కలిసి సీజ్ చేశారు. మునేంద్రముని ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న సమయంలో పక్కనే మరో రెండు వాటర్ ప్లాంట్లు మూసివేశామన్నారు. వీటిపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో 11 వాటర్ ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయన్నారు. ఐఎస్ఐ గుర్తింపు ఉన్న వాటర్ ప్లాంట్లలో మాత్రమే పరిశుభ్రమైన తాగునీరు ఉంటుందన్నారు. రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కారులో 84 కిలోల గంజాయి



పెదబయలులో గంజాయి, నిందితులతో పోలీసు సిబ్బంది



కారు సీటు కవర్లో అమర్చిన గంజాయి ప్యాకెట్లు

- కారు సీజ్, ఇద్దరు నిందితులకు రిమాండ్

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామ సమీపంలో కారులో తరలిస్తున్న 84 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు స్థానిక ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముసిడిపుట్టు గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా పెదబయలు నుంచి పాడేరు వెళ్తున్న కారు డిక్కీ, సీటు కవర్లలో ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేసి వాటిలో ప్యాక్ చేసిన గంజాయిని గుర్తించినట్టు తెలిపారు. గంజాయి ఒడిశా రాష్ట్రం బెజ్జింగిలో కొనుగోలు చేసి ముంచంగిపుట్టు మండలం ముక్కిపుట్టు మీదుగా పాడేరు తరలిస్తున్నారని పేర్కొన్నారు. కారుతో పాటు కాకినాడ జిల్లాకు చెందిన ఎస్.రామకృష్ణ, అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలానికి చెందిన లొంబోరి దాసుబాబును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం



సంఘటనా స్థలంలో మృతి చెందిన యువకుడు



సంఘటనా స్థలం

- ఆరుగురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు

ఎటపాక: ఎటపాక మండలం బండిరేవు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం కుంట ప్రాంతానికి చెందిన మడివి రాము, రాంబాబులు ద్విచక్ర వాహనంపై భద్రాచలం నుంచి కుంట వెళ్తున్నారు. విస్సాపురం గ్రామ పంచాయతీ పరిధి చిమిలి వాగు వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టును ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో రాము(30) అక్కడికక్కడే మృతిచెందగా, రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

రెండో రోడ్డు ప్రమాదం బండిరేవు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా ఆరుగురికి గాయాలయ్యాయి. చింతూరు మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో సంత ముగించుకుని ఆటోలో ఆరుగురు లక్ష్మీపురం బయలుదేరారు. భద్రాచలం నుంచి చింతూరు వెళ్తున్న ఓ మినీ వ్యాన్ కట్టలు విరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వంగోటి బ్రహ్మచారి(51) అక్కడికక్కడే మరణించగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కల్యాణపు లోవలో ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన



ప్రతిష్టాపన కార్యక్రమంలో భక్తులు

రావికమతం: కల్యాణపు లోవలో కల్యాణ పోతురాజుబాబు ఆలయం (శివాలయం) వద్ద మహా శివలింగంతోపాటు విఘ్నేశ్వర, నందీశ్వరుడు, చండీశ్వరుడు, దేవతా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. దేవదాయ శాఖ, ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో రుత్విక్‌లు ఈ క్రతువు నిర్వహించారు. హోమాది కార్యక్రమాలు చేపట్టారు. విగ్రహాల ప్రతిష్టాపనతోపాటు ఆలయంలో టైల్స్ వేసి అందంగా తయారు చేయడంతో కొత్తరూపు దిద్దుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ పైల రాజు, ఆలయ చైర్మన్ పాడి పోతురాజు, సర్పంచ్ వంజరి గంగరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సచివాలయ మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఈవో మురళీ కృష్ణ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

నర్సీపట్నం: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఓ యువకుడిని శుక్రవారం నర్సీపట్నం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఎన్. గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఎం.వెంకటేష్(32), నర్సీపట్నం గురందరపాలెంలో నివసిస్తున్న యువతి ఒకే ప్రార్థన మందిరానికి వెళ్లే వారు. ఈ క్రమంలో వేర్వేరు కులాలకు చెందిన వీరి మధ్య పరిచయం ప్రేమకు దారి తీసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి వెంకటేష్ సదరు యువతిని శారీరకంగా లోబర్చుకున్నాడు. అయితే వీరి పెళ్లికి పెద్దల సమక్షంలో అంగీకారం కుదిరింది. నిశ్చితార్థం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేష్ పెళ్లికి మొహం చాటేయడంతో న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి

అనకాపల్లి టౌన్: పట్టణంలో జులగలమదుం కూడలి వద్ద గురువారం రాత్రి లారీ ఢీకొని విశ్రాంత ఆర్మీ ఉద్యోగి పడాల రామారావు(52) దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ వివరాల ప్రకారం... విశాఖపట్నం నుంచి బుచ్చెయ్యపేట మండలం నీలకంఠపురం గ్రామానికి తన బైక్‌పై రామారావు వెళ్తున్నాడు. అదే రహదారిలో వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రత్నకుమారి శుక్రవారం పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన దుర్గాలమ్మ పండగ



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

అనకాపల్లిటౌన్: విజయరామరాజుపేటలో వెలిసిన శ్రీ దుర్గాలమ్మ పండగ గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారి సారే ఊరేగింపు, ఉత్సవం ఒకేరోజు చేయడం జరిగిందని, రాత్రి అమ్మవారి ఘటాలను పట్టణంలో పురవీధుల గుండా ఊరేగించినట్టు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి పలకా రాము, ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పారావు, కోశాధికారి పిట్ట బుద్దేశ్వర రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు సాయినగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లిటౌన్ : కశింకోట మండలం జాతీయ రహదారి సాయిబాబా గుడి ఎదురుగా సాయినగర్‌లో గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ ప్రేమికులు వచ్చి మొక్కలను నాటాలని ఆయన పిలుపునిచ్చారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



బవులవాడ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : బవులవాడ పంచాయతీ పరిధి ఆర్‌వీఎస్ నగర్‌లో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచి చూశారు. పాఠశాలలో వున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. స్కూల్లో టాయ్‌లెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూడాలన్నారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందజేసే పోషకాహార కిట్ల గురించి ఆరా తీశారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. ఇందులో ఎంపీడీవో కె.ధర్మారావు, బవులవాడ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మజ్జి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 7,306 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,180
మొదటి రకం	3,400	3,750
రెండో రకం	3,090	3,480
మూడో రకం	2,980	3,080

అనకాపల్లి సినిమాలు

పాప్‌కార్న్	- రాజా
వేద	-సత్యనారాయణ స్క్రీన్-1
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
చడ్డీగ్యాంగ్ (ఉదయం, మధ్యాహ్నం)	- శ్రీసత్య
వారసుడు (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 78 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు , బీ పాజిటివ్–35 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్ 28 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్ –2 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 396 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

అంగన్‌వాడీ-నూతన ఒరవడి

- ఆంగ్ల మాధ్యమంలో ప్రీ స్కూళ్ల ఏర్పాటు
- ఆట,పాటలతో కూడిన విద్య
- బొమ్మలతో అర్థమయ్యే రీతిలో విద్యా బోధన
- అనకాపల్లి మండలంలో 165 అంగన్‌వాడీ స్కూళ్లు



అనకాపల్లి పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న పిల్లలు



ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లతో బొమ్మల రూపంలో పాఠాలు నేర్చుకుంటున్న పిల్లలు

అనకాపల్లి రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో కేవలం ఆరోగ్య,పౌష్టికాహార కేంద్రాలుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించి ప్రీ స్కూల్ కిట్లతో విద్యార్థులకు అక్షరాలను నేర్పిస్తున్నారు. ప్రాథమిక విద్యకు చిన్నారులను సిద్ధం చేసేలా కేంద్రాలను సుందరంగా ముస్తాబు చేస్తోంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు ప్రీ స్కూళ్లను ఏర్పాటు చేసింది. నాడు–నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా నిధులు కేటాయిస్తోంది. ప్రీ స్కూళ్లలో సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లను తీర్చిదిద్ది వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు నూతన మెలకువలతో ఆట,పాటలద్వారా ప్రీ స్కూళ్లలో చిన్నారులను తీర్చిదిద్దుతున్నారు.

165 కేంద్రాల్లో ప్రత్యేక సిలబస్

అనకాపల్లి పట్టణంలో 74 మండలంలో 91 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు సుమారుగా 2,200 మంది ఉన్నారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రీ స్కూళ్ల కోసం ప్రత్యేక ప్రణాళికలు, నూతన సిలబస్‌లు రూపొందించింది. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం నాణ్యమైన ప్రీ స్కూళ్ల కిట్లను అందించింది. వీటితో టీచర్లు సొంతంగా బొమ్మలు తయారు చేసి చిన్నారులకు అనుకూలంగా ఇష్టపడేలా విద్యాబోధన చేస్తున్నారు. వివిధ రకాల బొమ్మలు చిన్నారులకు చూపించి, పాఠాలు బోధించడం వల్ల వారు ఆసక్తిగా నేర్చుకుని, సులభంగా అర్థం చేసుకుంటున్నారు. ఫలితంగా పిల్లలు అభ్యసనకు అలవాటుపడి ఆసక్తి చూపడంతో పాటు చిన్న వయసులోనే విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నారు.

ఆంగ్ల మాధ్యమంలో బోధన

ప్రభుత్వం ప్రీ ప్రైమరీ నుంచి అంగన్‌వాడీలను ఇంగ్లిష్ మీడియం పాఠశాలలుగా తీర్చిదిద్దింది. ఈ మేరకు టీచర్లకు అవసరమైన ప్రత్యేక శిక్షణ సైతం అందిస్తోంది. శిక్షణ పొందిన టీచర్లు ఆంగ్లంపై చిన్నారులకు ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేస్తూ వారిని ప్రేరేపిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల్లో భాగంగా బొమ్మల తయారీకి అవసరమైన చార్టులు, రంగు పెన్సిళ్లు, స్కెచ్‌లు, రబ్బర్లు తదితర సామగ్రిని ప్రభుత్వం కేంద్రాలకు సమకూర్చింది. వీటి వినియోగంపై సూపర్‌వైజర్లకు ఇప్పటికే స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. చిన్న,చిన్న వస్తువులను ఉపయోగించి, వస్తువులు, అంకెలు, పండ్లు, కూరగాయలు, జంతువులు, పక్షులు, వివిధ రకాల వాహనాల బొమ్మలను తయారు చేసి వాటితో కథల ద్వారా చిన్నారులకు చదువుపై దృష్టి మళ్లేలా చర్యలు చేపడుతున్నారు. సమయానుకూలంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు అవసరమైన శిక్షణ అందించడంతో పాటు వారికి అవసరమైన ప్రత్యేక యూ ట్యూబ్ ఛానల్ కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మొత్తం మీద గతంలో కంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యాబోధన, పౌష్టికాహారం అందుతుండడంతో వాటి రూపురేఖలు సమూలంగా మారిపోయాయని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

కిట్లతో బోధన



అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లగా మార్చడం వల్ల పిల్లలకు చాలా ప్రయోజనం. కేంద్రాల్లో టీచర్లు కిట్లతో చిన్నారులకు నూతన ఒరవడిలో బోధిస్తున్నారు. కిట్ల ద్వారా బోధన ప్రారంభమైన తర్వాత కేంద్రాలకు చిన్నారుల రాక పెరిగింది. వారిని ఆకర్షించి, సులభంగా వారికి అర్థమయ్యేలా బోధన చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. దీని వల్ల భవిష్యత్‌లో మంచి ఫలితాలు కలుగుతాయి.

–సీడీపీవో ప్రభావతి, అనకాపల్లి

నేడు గౌరీపరమేశ్వరుల ఉత్సవం





కశింకోటలో వెలసి ఉన్న గౌరీపరమేశ్వరులు, ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలంకరణ

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద వెలసి ఉన్న గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం జరగనుంది. ఇందుకు భారీ సన్నాహాలు చేసినట్లు ఉత్సవ కమిటీ పేర్కొంది. మండలంలో నిర్వహించే ఉత్సవాల్లో అతి పెద్దదైన పడమటమ్మ ఉత్సవం తర్వాత అంతటి భారీగా గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఏటా ఫిబ్రవరి నెలలో గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవం సందర్భంగా గ్రామంలో ఆర్కెస్ట్రా, నేల వేషాలతో గౌరమ్మను రథంపై ఊరేగిస్తామని కమిటీ తెలిపింది. ఉత్సవం పురస్కరించుకొని భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. డాన్స్ బేబీ డాన్స్, బుర్ర కథలు, పందెం కోళ్లు, పూనకాల లోడింగ్, రారండోయ్ పండగ చూద్దాం, కరీంనగర్ వారి నెమలి నృత్యాలు, పలు నేల వేషాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆకర్షణీయంగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటుతోపాటు బాణసంచా పెద్ద ఎత్తున కాల్చనున్నట్టు కమిటీ తెలిపింది. పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

'కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం'



అనకాపల్లిలో కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

అనకాపల్లి రూరల్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందంటూ శుక్రవారం అనకాపల్లి ఎస్‌బీఐ ముఖద్వారం వద్ద సీపీఐ నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ మాట్లాడుతూ వ్యవసాయ, గ్రామీణ ఉపాధి హామీ, అనుబంధ రంగాలకు నిధులు తక్కువ కేటాయించడంపై ఆయన మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్ట్‌కు, విశాఖ రైల్వేజోన్‌కు తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదానీకి కట్టబెట్టిన పోర్టులను జాతీయం చేసి, స్టీల్‌ప్లాంట్, ఎల్‌ఐసీ, రైల్వే ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, వై.ఎన్.భద్రం, వియ్యపు రాజు, కోన లక్ష్మణ, చెల్లూరి నాగరాజు నాయుడు, మల్లికార్జునరావు, టి.వెంకటేశ్వర్లు, సత్యారావు ,శ్రీరామదాసు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ సారె ఊరేగింపు



కశింకోటలో గౌరమ్మ సారె ఊరేగింపు



సారె ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి

కశింకోట : కశింకోటలో శుక్రవారం రాత్రి డీపీఎన్ హైస్కూలు వద్ద వెలసి ఉన్న గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) సారె ఊరేగింపు వైభవంగా జరిగింది. గౌరమ్మ ఉత్సవం శనివారం జరగనున్న దృష్ట్యా ముందు రోజు సంప్రదాయంగా సారె ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తయారు చేసిన పిండి వంటలు, బెల్లం దిమ్మె, వివిధ రకాల పండ్లు తీసుకు వచ్చి పళ్లాల్లో గౌరమ్మ విగ్రహం ముందు నివేదించి పూజలు చేశారు. డప్పులు, వాయిద్యాలతో నృత్యాలతో గౌరమ్మ చిత్ర పటాన్ని ఊరేగిస్తూ పెద్ద ఊరేగింపు ఆలయం నుంచి ప్రారంభమైంది. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ ఊరేగింపును ప్రారంభించారు. సారె ఊరేగింపును దారి పొడవునా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మాజీ ఎంపీపీ పెంటకోట సుబ్బలక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, వేగి దొరబాబు, దాడి కృష్ణ, వేగి తారకేశ్వరరావు, కోయిలాడ నాగు, భీశెట్టి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

అమల్లోకి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

కశింకోట : ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పంచాయతీలు, స్థానిక ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఫ్లెక్సీ బోర్డులను తొలగించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు ఆదేశించారు. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్, చెరువుల అభివృద్ధిపై సమీక్షించారు.

విసన్నపేట భూములపై న్యాయ విచారణకు డిమాండ్

అనకాపల్లి టౌన్: కశింకోట మండలం విసన్నపేట భూముల విషయంలో జ్యుడీషియల్ రివ్యూ జరిపించాలని జనసేన నియోజకవర్గ నేతలు దూలం గోపి, తాడి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక బారువారివీధిలో ప్రైవేటు భవనంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నేతలు తమపార్టీపై బురదజల్లేలా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ల శ్రీను, భర్నికాన రమణబాబు, మజ్జి పద్మసీతారామలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి



పర్యావరణం, ప్లాస్టిక్ నిర్మూలనపై ఇంటింటా అవగాహన కల్పిస్తున్న డైట్ కళాశాల విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : పర్యావరణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.నరసింహం అన్నారు. డైట్ కళాశాల(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మండలంలో అక్కిరెడ్డిపాలెం దత్తత గ్రామంలో శుక్రవారం పర్యావరణం, పరిశుభ్రత, ఆత్మరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, ప్లాస్టిక్ నివారణపై ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని, ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సుధాస్టోన్ చిప్స్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

అనకాపల్లిటౌన్: మండలంలో ఊడేరు గ్రామంలో శుక్రవారం సుధాస్టోన్ చిప్స్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. గ్రామస్తుల నుంచి డీఆర్వో వెంకటరమణ స్టోన్‌చిప్స్ ఆమోదయోగ్యంపై గ్రామస్తుల నుంచి వివరాలు రాబట్టారు. కంపెనీలో ఉపాధి అవకాశాలు, రహదారులు, దుమ్ము, ధూళి నివారించేందుకు సాయంత్రం సమయంలో వాటరింగ్ చేయాలనే డిమాండ్లు గ్రామస్తులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వర్లు, మైనింగ్ ఏడీ రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి మళ్లీ కొలతలు



రోడ్డు నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట : పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నిర్మాణానికి అధికార యంత్రాంగం పనులు ప్రారంభిస్తున్నారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వర్తకులు రోడ్డు విస్తరణ చేస్తే తమ వ్యాపారాలకు ఇబ్బంది కలుగుతుందని, తమకు ప్రత్యామ్నాయం చూపించాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో మూడేళ్లుగా రోడ్డు నిర్మాణం, విస్తరణ జరగకుండా నిలిచిపోయాయి. రోడ్లు భవనాల శాఖ పరిధిలో వున్న ఈ రోడ్డును మరింత అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం వుడా పరిధిలోకి చేర్చారు. అప్పట్లో రోడ్డు నిర్మాణానికి కిలోమీటరున్నర మెయిన్‌రోడ్డుకు రూ. 6 కోట్లు సుమారుగా నిధులు మంజూరయ్యాయి. చిన్నవర్తకులు కోర్టును ఆశ్రయించడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు ప్రజాప్రతినిధులు స్పందించి, రోడ్డును పరిశీలించారు. అధికారులతో సమీక్షలు జరిపారు. ఆర్‌డీవో జయరాం రోడ్డును పరిశీలించి, చిన్న వర్తకులకు నష్టం జరగకుండా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, మళ్లీ రోడ్డు అభివృద్ధికి కొలతలు తీసుకోవాలని, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిన్న వర్తకుల జాబితాను కూడా తయారుచేయాలని ఆదేశించారు. ఈమేరకు రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మరలా రోడ్డుకు కొలతలు తీసుకుంటున్నారు.

సముద్రంలో వేటకెళ్లే మత్స్యకారులకు కోస్ట్‌గార్డ్ సూచనలు

ఎస్.రాయవరం : మత్స్యకారులు సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లేటప్పుడు విధిగా జాగ్రత్తలు పాటించాలని నేవీ కోస్ట్‌గార్డు సిబ్బంది కిషోర్‌కుమార్, అమన్ ద్వివాది అన్నారు. బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాల్లో శుక్రవారం పలువురు మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సముద్రంలోకి వెళ్లినవారు తీసుకోవాల్సి జాగ్రత్తలు, సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పాటించాల్సిన నియమాలతో కూడిన కరపత్రాలను పంచారు. చేపల వేటకు వెళ్లేవారు ఒంటరిగా కాకుండా అందరితో కలిసి వెళ్లాలని, దేశ జెండా పడవపై ముందు, వెనుక భాగాల్లో కనిపించే విధంగా అమర్చుకోవాలని అన్నారు. పడవ ప్రయాణంలో లైఫ్ జాకెట్ విధిగా తీసుకు వెళ్లాలన్నారు. పడవ రంగు ప్రభుత్వ అధికారులు చెప్పినట్టు ఉండాలన్నారు. పడవలో ఎరుపు రంగు వస్త్రం ఉంచుకోవాలన్నారు. పడవలో వాతావరణం సమాచారం తెలుసుకునేందుకు రేడియో వంటి వస్తువు ఉంచుకోవాలన్నారు. దేశ సముద్ర సరిహద్దు దాటకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇలా గ్రామంలో పలు వీధుల్లో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వాకపాడు ఎంపీటీసీ మాధవ కూడా పాల్గొన్నారు.

ఆవ కాలువను బాగు చేయరూ..



స్వరూపం కోల్పోతున్న ఆవ కాలువ

మునగపాక : మునగపాకలోని ఆవ కాలువ తన స్వరూపం కోల్పోతుంది. కాలువను ఆనుకొని భారీ వృక్షాల మోడులు వేసేయడంతో సీజన్‌లో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కేవలం సాగునీటి కాలువలపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు ఆవ కాలువ దుస్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు. కాలువలను ఎప్పటికపుడు అభివృద్ధి చేయాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సాగునీటి ప్రవాహం ప్రశ్నార్థకంగా మిగిలిపోతుందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువను అభివృద్ధి చేసి రైతులకు వినియోగంలోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



పాములవాకలో ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు



సన్యాసిరాజుపాలెంలో అడవిరాజులబాబును దర్శించుకున్న ఎంపీటీసీ రాంబాబు తదితరులు

కోటవురట్ల : అడవిరాజులబాబు పండగ సందర్భంగా పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల వద్ద సందడి కనిపించింది. మండలంలోని పాములవాక, సన్యాసిరాజుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం అడవిరాజుల బాబు పండగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులంతా గ్రామ పొలిమేరల్లో ఉన్న ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. పాములవాకలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సన్యాసిరాజుపాలెంలో ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నబాబు తదితరులు ఆలయంలో దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


సైబర్ మోసాల పట్ల అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆలీ

మునగపాక : మహిళలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ కోరారు. మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం సాయంత్రం సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఎక్కడ చూసినా మోసాలకు పాల్పడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. బ్యాంక్ ఖాతాల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇతరులు ఎవరైనా ఓటీపీ అడిగితే వారికి సమాధానం ఇవ్వరాదన్నారు. మహిళలను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాగే సాయం సమయంలో పొలాల నుంచి వచ్చేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు.


మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పాటుపడాలి



మాట్లాడుతున్న రోటరీ పూర్వ గవర్నర్ రామారావు

మునగపాక : మహిళలు సొంతంగా వ్యాపారం చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని రోటరీ పూర్వ గవర్నర్ రామారావు కోరారు.నాగులాపల్లిలో రోటరీ ఫౌండేషన్ గ్లోబరీ గ్రాంట్ ద్వారా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరంలో పాల్గొన్న మహిళలకు శుక్రవారం కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుట్టుమిషన్లతో పాటు బ్యాంక్ రుణ సదుపాయం అందజేస్తామన్నారు. కుటీర పరిశ్రమల ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సీహెచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ మహిళలకు కుట్టుమిషన్లపై శిక్షణ ఇచ్చిన దేవిని అభినందించారు. జన శిక్షణ సంస్థాన్ ప్రతినిధులు డీపీ నాయుడు, మనోహర్, మళ్ల బుజ్జి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



ముస్తాబు అవుతున్న అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం : కొరుప్రోలు గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవానికి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం వేకువ జామునుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు మునగపాకలో ఉచిత వైద్య శిబిరం

మునగపాక : మునగపాక ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సాగర్ హెల్త్‌కేర్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్ర దేవ్ వేచలపు, డెంటల్ సర్జన్ డాక్టర్ ఎ.పోలినాయుడు, డయాబటాలజిస్టు డాక్టర్ కె.అనూష వైద్య సేవలందిస్తారన్నారు. ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.